# అతనికంటె ఘనుడు

''సుత్తికొట్టు మనుషులెందరులేరు. వాళ్ళల్లో ఆయనా ఒకడు. మరి తప్పదు జీవితంలో కొన్ని సుఖాలు కావాలనుకున్నప్పుడు, అవి పెట్టుకొచ్చే ముళ్ళ కిరీటాన్ని కూడా భరించాల్సిందే....'' అని నేను ఫిలసాఫికల్‌గా మాట్లాడబోయాను.

కొత్తగా ఉద్యోగమొచ్చింది. గది వెతుక్కునే వేటలో పడిపోయాను. ఎంత కాలమని మిత్రుడి గదిలో కాలక్షేపం చేయను. అతనున్న గది చాలా చిన్నది. అదిగో ఆ సందర్భంలో మా కొలీగ్ బ్రహ్మానందం ఇంటికి వెళ్ళాను. పరాంకుశంగారని అతనికి తెల్సిన పెద్దమనిషి ఇంట్లో గది ఖాళీగా వుందట. ''కానీ ఆ మనిషి బోర్ భరించలేవు. అన్ని విషయాల్లోనూ మంచివాడే, అద్దె కూడా పెద్దగా తీసుకోడు. ఈ మధ్యే రిటైరయాడు. దాంతో మరీ రెచ్చిపోయాట్ట'' అని బ్రహ్మానందం అంటే నేనన్న మాటలవి.

బ్రహ్మానందం నా వంక జాలిగా చూశాడు.

''పరాంకుశంగారిని మిగతా బోరుల్లాగా భావించకు. ఆయనదో ప్రత్యేకత. తనదైన పంథానేర్పరుచుకున్న మనిషి. ఆమధ్య మా అమ్మా నాన్న నా దగ్గరకొచ్చి వారం రోజులున్నారు. పరాంకుశంగారు మా ఊరివాడు. వరసగా మూడు రోజులు వచ్చి ఆయన మానాన్నతో మాట్లాడిన తరువాత, జీవితంలో జ్వరం చీదెరగని మా నాన్నకు అకస్మాత్తుగా హార్ట్ అటాక్ వచ్చింది. 'నిమ్స్'లో చేర్పించాను. కాస్తంత ఆరోగ్యం కుదుటబడ్డ తరువాత వాళ్ళనటునుండి అటే పంపేశాను. మానాన్న ఇక ఛస్తే హైదరాబాదు రానన్నాడు.''

''నమ్మబుల్‌గా లేద్సార్. మీరు అతిశయోక్తిగా చెప్తున్నారు'' అన్నాను.

''ముసలితనంలో పరాంకుశంగారి తల్లికి మాటెందుకు పడిపోయింది? టి.బి వచ్చి శానిటోరియంలో చేరిన పరాంకుశంగారి మామగారికి జబ్బెందుకు తిరగబెట్టిందనుకున్నావు? పరాంకుశంగారు ఆయన్ను పరామర్శించటానికి వెళ్ళినందువల్లే.''

''పొండి సార్! మీరు నన్ను మరీ భయపెట్టేస్తున్నారు.''

బ్రహ్మానందం నా వంక 'ఇంత మూఢుడివేం' అన్నట్టు చూశాడు. ఆత్మబోధ చేసే పరమాచార్యుడిలా పరాంకుశంగారి చరిత్ర నాకు చెప్పసాగాడు.

''ఆయన భార్య పద్మావతమ్మ గారికి బ్రహ్మచెవుడు. పక్కన బాంబు పడ్డా ఆవిడకి విన్పించదు. మొదటి నుండీ ఆవిడకు చెవుడు లేదు. భర్తబోరు భరించలేకే ఆమెకు చెవుడు వచ్చింది. రియల్లీ ఎ బ్లెస్సింగ్ ఇన్ డిజ్‌గైజ్. చెవులున్న కాలంలో ఆవిడపడ్డ బాధ అంతా ఇంతా కాదు. చెవుడొచ్చింది, ఆవిడంత సుఖజీవి మరొకరులేరు. పరాంకుశంగారు చాలా బాధపడ్డారు. ఆమెకు చెవుడొచ్చిందని కాదు. మాట్లాడేందుకు మనుషులు కరువయ్యారని. మాట్లాడటానికి మనుషులు లేని జన్మేం జన్మ! ఆఫీసులో సహోద్యోగులూ, పరిచయస్థులూ, బంధువులు ఏదో కొంతకాలమే ఆయన్ను భరించేవాళ్లు. కాని భర్తకదా, ఆమెకు అలా కుదరలేదు. భర్త పెట్టే బాధలన్నీ పడాలని భారతనారి మొహాన రాసుంది. ఆయన సుత్తి భరించక తప్పలేదు. విని విని ఆమెకు చెవుడొచ్చేసింది. పది జన్మలకు సరిపడ్డ మాటలు విన్న తరువాత ఆ చెవులేం పనిచేస్తాయి. బయటకెళ్ళినప్పుడు తృప్తి తీరా మాట్లాడుకొచ్చేవాడేకాని, ఎప్పుడూ బయట కెళ్ళాల్సిన పని వుండదుగా. అందువల్ల పట్టువదలని విక్రమార్కుడిలా పరాంకుశంగారు 'డెఫ్ అండ్ డంబ్' స్కూల్లో పనిచేసే ఓ మాష్టర్ని తమ ఇద్దరకూ సంజ్ఞల భాష నేర్పమని ఎంగేజ్ చేశాడు. కాని పద్మావతమ్మగారు ససేమిరా ఆ భాష నేర్చుకోనని మొండికేసింది. జన్మకో శివరాత్రి అన్నట్టు అదృష్టవశాత్తూ వచ్చిన చెవిటి మాలక్ష్మిని వదిలించుకోవాలనుకోలేదు ఆమె. పరాంకుశంగారు నిరాశ చెందలేదు. భార్య నిరాకరిస్తేనేం, తనైనా ఇతోధికంగా కృషి చేద్దామని ప్రయత్నించాడుకాని, ఆ మాష్టారు సంజ్ఞల భాషకు చేతులు, వేళ్ల మాత్రమే కదపాలన్నాడు. కాని, నోరు తెరవకూడదన్న ఆంక్షపెట్టటంతో ఆయనకు చిరాకు కలిగి, మాష్టరుకు ఉద్వాసన చెప్పాడు. జన్మకో నోరన్నట్టు వున్న తన స్వంత నోటిని తెరవద్దనటానికి ఆ మాష్టరు ఎవడూ అంట?'' బ్రహ్మానందం పరాంకుశంగారి గుణగానంలో తన్మయుడై హరికథ చెప్పసాగాడు.

''వాళ్ళకు పిల్లల్లేరా!'' అడిగాను నేను.

''లేకేం. ముగ్గురు. పెద్ద పిల్ల ఆడపిల్ల. ఇరవయ్యేళ్లకే ఆమె మనసు పెళ్ళి మీదకు పోయింది. 'నాకు పెళ్ళి చేసేయండి' అని ఆడపిల్లల సహజమైన సిగ్గు బిడియాలూ వదిలేసి తల్లిదండ్రులనడిగింది. కారణం- తండ్రినోటి బాధే...''

''నేన్నమ్మను సార్'' అన్నాను.

''మరి ఆ పిల్ల అత్తిల్లే స్వర్గమనుకుని, ఈ ఛాయలకెప్పుడూ ఎందుకు తిరిగి రాలేదు? ఇహ పెద్ద కొడుకు డాక్టరు. అతనికి హైదరాబాదు మెడికల్ కాలేజీలో సీటు వచ్చినా ఇక్కడే వుండి చదువుకోటానికి ససేమిరా ఇష్టపడలేదు. జమ్మూ మెడికల్ కాలేజీలో సీటు సంపాదించి కాశ్మీర్ వెళ్ళిపోయాడు. ఆ కాశ్మీరు లోయ అందచందాలు అతన్ని ఆకట్టుకోసాగాయి. శలవలకు కూడా ఇంటికి రావటం మానుకున్నాడు. కొడుకు చదువైపోతే తమ ఇంట్లోనే ఓభాగంలో అతని చేత ఓ ప్రైవేట్ క్లినిక్ తెరిపిద్దామనుకున్నాడు ఈయన. కాని ఆ కొడుకు ఓ కాశ్మీరు సుందరిని ప్రేమించి పెళ్ళిచేసుకుని అక్కడే సెటిలయిపోయాడు.''

''అంత అతిశయోక్తిగా మాట్లాడకండి సార్! కాశ్మీరు లోయలో బయటి వాళ్లెవరూ సెటిలవటానికి వీలులేదు. ఆర్టికల్ 370...''

''నేటివ్స్‌ని పెళ్ళి చేసుకుంటే ఆ అభ్యంతరమేం లేదయ్యా! సరే పెళ్ళి చేసుకున్నాడా, ఆ విషయం తల్లిదండ్రులకో ఉత్తరం ముక్క రాసి పడేశాడు. వీళ్లిద్దరూ కొడుకూ కోడల్ని చూసుకుందామని జమ్మూ వెళ్లారు. తల్లిదండ్రులున్నంత కాలం కొడుక్కు తండ్రితో మాట్లాడే వెసులుబాటే దొరకలేదు. అంత బిజీ ప్రాక్టీసు. పరాంకుశంగారు అక్కడికీ కోడలితో మాట్లాడప్రయత్నించాడు. కనీసం హిందీ కూడా రాదు ఈయనకు. ఎంతసేపని మ్లేచ్ఛభాష ఇంగ్లీషులో మాట్లాడుకుంటారు. పిచ్చాపాటికి ఆంగ్లభాష పనికి రాదని పరాంకుశంగారి పరమోద్దేశం. అందువల్ల నోరు విప్పే ఆస్కారంలేని ఆ చలి దేశంలో వుండలేక దంపతులు తిరిగి హైదరాబాదు చేరుకున్నారు...''

''అంటే అతను కాశ్మీరులో సెటిలవటం తండ్రి నోటికి వెరిచేనని మీ ఉద్దేశం. మరి చిన్న కొడుకు సంగతేంటి?'' అనడిగాను నేను.

''అతను ఇంజనీరు. తండ్రికి దీటైన వాడు. పరమ పితృభక్తి తత్పరుడు. తండ్రీ కొడుకూ గంటల తరబడి మాట్లాడుకునేవాళ్ళు. అతనికుద్యోగం దొరకలేదు. ఎయిర్‌ఫోర్స్‌కి అప్లయిచేశాడు. 'షార్ట్ సర్వీస్ కమిషన్ 'లో సెలక్టయి పైలట్ ఆఫీసరయ్యాడు. మాట్లాడటానికి చుట్టూ జనం. అతనికెంతో ఆనందం వేసింది. ఈమధ్యే రిటైరై బెంగుళూరులో పెద్ద కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. అతనికింకా పెళ్లికాలేదు...''

''పోన్లెండి సార్! అంతగా ఆయన బోర్ భరించలేకపోతే అప్పుడే వేరే గదిలోకి మార్తాను. మీరు కాస్త సాయం చెయ్యండి'' అన్నాను.

''సరే పద. నీ జాతకంలో ఎలా వుంటే అలా జరుగుతుంది. ఇంత చెప్పినా నువ్వు వినటం లేదంటే, నుదుటి రాతనెవరు తప్పించగలరు. పద పోదాం'' అన్నాడతను.

బ్రహ్మానందం ఇంటికి పరాంకుశంగారిల్లు దగ్గరే. గేటు తీసుకునిలోపలకెళ్ళాం. ఇల్లు చిన్నదయినా పొందిగ్గా ఉంది. ముందు చక్కటి పూలతోట. నాకా వాతావరణం నచ్చింది. పరాంకుశంగారు సావకాశంగా పడక్కుర్చీలో పడుకుని పెద్దగా పాటలు పాడుతూ పేపరు చదువుతున్నాడు. గేటు తీసిన చప్పుడయి, పేపరు పక్కకు తొలగించి మేం రావటం చూశాడు. ఆయన కళ్ళల్లో ఒక్క మెరుపు మెరిసింది. ముఖం ఆనందంతో రెండింతలైంది.

''ఎవరూ! బ్రహ్మానందమా! కంటిలో నలుసై పోయావే. ఈమధ్య పనిగట్టుకుని మీ ఇంటికొచ్చాను. నువ్వు ఊరెళ్లావని చెప్పింది మీ ఆవిడ. ఊళ్లో అంతా కులాసానా? మీ నాన్న, అమ్మా... అదేనోయ్, నాకర్థం కాని విషయం. పిల్లల పెళ్ళిళ్లు చేశారా, వాళ్లిద్దరికీ అక్కడేం

తోస్తుంది. హాయిగా నీదగ్గరో, మీ తమ్ముడి దగ్గరో వచ్చి వుంటే పోలా? ఏ బాదరబందీ లేకుండా కృష్ణారామా అంటూ కాలక్షేపం చేయవచ్చు. కిందటి నెల్లో మనూరు వెళ్లినప్పుడు చెప్పాను మీ నాయనకు, 'ఎందుకురా, నువ్వూ నీపెళ్లాం ఇక్కడ లింగూ లిటుకూమంటూ. వచ్చి బ్రహ్మానందం దగ్గర వుండండి. చిన్ననాటి స్నేహితులం, ఓ తోడంటూవుంటే ఇద్దరికీ చక్కగా కాలక్షేపమౌతుంది. ఇంకా ముసలితనంలో నీకు సంసార తాపత్రయమెందుకు? కొడుకుల కొదిలెయ్యవోయ్. వాళ్లే చూసుకుంటారు. నేనూ అదే పనిచేశాను. రిటైరయిపోయాక, అంతా వాళ్లమీదే వదిలేశాను. మనమిప్పుడు తీసుకోవాల్సింది పాలసీ డెసిషన్స్‌రా, పైపై సూపర్‌విజన్ చేస్తే సరిపోతుంది. ఏవంటావు?' అన్నాను. వాడో మూర్ఖపు ముఖం. వింటేనా నామాట. ముసలితనంతోపాటు మొండితనంకూడా వస్తుందోయ్. వాళ్ల ఆలోచనే వాళ్లకుగానీ, మన మంచికి చెప్పారన్న ఆలోచన వుండదు. ముసలితనం వస్తున్న కొద్దీ చాదస్తం పెరుగుతుంది. అంతా మనమే చెయ్యాలి. మనతోనే లోకముందనుకుంటారు. అది మీ నాయన సంగతేకాదు, ఏదో నాలాంటి వాళ్లని కొద్దిమందిని తప్పించి, చాలామంది సంసార జంఝాటంలో పడి మునిగి తేలుతున్న వాళ్ళే...'' అని అలా అప్రతిహతంగా మాట్లాడుతూనే వున్నాడు పరాంకుశంగారు. వచ్చిన వాళ్లని కూర్చోమనలేదు. ఆయనకా తీరిక లేదు. నా ఉనికిని కూడా గుర్తించక బ్రహ్మానందంతో మాట్లాడుతూ వుండి పోయాడు ఆయన. బ్రహ్మానందం బ్రేక్ వేయకపోతే ఆయన ఆగేవాడు కాదు.

''వీరు వెంకట్రావుగారని కొత్తగా మా ఆఫీసులో చేరారు. బ్రహ్మచారి. గది అద్దెకు కావాలంటే తీసుకొచ్చాను'' అని క్లుప్తంగా బ్రహ్మానందం చెప్పాడు.

''మంచి పనిచేశావు. రావయ్యా! రా! వెంకట్రావూ! కూర్చో. ఏకవచనంలో సంబోధిస్తున్నానని ఏమనుకోకు. నాకీ కృత్రిమ మర్యాదలంటే గిట్టవు. చిన్నవాడివి. ఎంత వుంటుంది నీ వయసు. మహావుంటే పాతికేళ్ళు. మా చిన్నబ్బాయికంటే కొంచెం చిన్న. పెద్దవాళ్ళు చిన్నవాళ్లని గౌరవించి మాట్లాడటం ఆయుక్షీణమయ్యా...''

''గది చూపిస్తే...'' అని నేను నసిగాను ఆయన మాటలకడ్డొచ్చి.

''దానికేం భాగ్యమోయ్ అలాగే. నీకు మా గది నచ్చి తీరుతుంది. సకల సౌకర్యాలూ వున్నాయి. గదికే అటాచ్‌డ్ బాత్రూం, లావెట్రీ వున్నాయి. మునిసిపల్ టాప్ బాత్రూంలో పెట్టించాను. పొద్దునో రెండు బిందెలు మంచినీళ్లు పట్టుకుంటే చాలు. మామూలు వాడిక్కి నీళ్ల ఇబ్బంది లేదు. పైన వోవర్‌హెడ్ టాంక్ కట్టించాను. ఇరవై నాలుగ్గంటలూ నీళ్లొస్తాయి. గది సపరేట్‌గా ఉంది. రాకపోకలకి మాతో సంబంధంలేదు. నీ ఇష్టమొచ్చినప్పుడు రావచ్చు, నీ ఇష్టమొచ్చినప్పుడు పోవచ్చు. గదిలో ఓమంచం, ఫాను కూడా ఏర్పాటు చేయించాను. ఎండాకాలంలో డాబా మీద పడుకోవచ్చు. అద్దెకూడా చవకే. మనవాడివి కనుక రెండొందలివ్వు.

ఈకాలంలో ఇంత తక్కువకు నీకు మరెక్కడా గది దొరకదు. నేను డబ్బు మనిషినికాదు. డబ్బుదేం వుందయ్యా! మనం సృష్టించిన డబ్బు మనల్ని శాసించరాదు. మనిషి డబ్బుకు దాసోహమనరాదు. డబ్బు ఇవాళ వుంటుంది. రేపు పోతుంది. మనుషులు ముఖ్యం. నీకే అవసరమొచ్చినా మొహమాటపడక మమ్మల్ని అడుగు. మా ఇంట్లో వుండే మనిషి సుఖసంతోషాలతో వుంటే కదా మాకానందం. పొరుగు వాడు సుఖపడుతుంటే చూసి ఆనందపడటమంటే, అదే స్వచ్ఛమైన ఆనందం. నిజమైన కర్మయోగి అనుభవించే ఆనందం. స్వామి వివేకానందుడేమన్నాడో తెల్సా...''

లేచి మాకు గది చూపించకుండా, నోటిని ఆడిస్తున్న ఆ పెద్దమనిషి ఇంకేం చెప్పేవాడో కాని, ఆయన భార్య మాకు కప్పులతో కాఫీ తీసుకొచ్చింది. ఆమె బ్రహ్మానందం వంక చూసి, ఓ చిరునవ్వు వెలార్చి, ''బాగున్నావటయ్యా బ్రహ్మానందం!'' అంది.

అతనూ చిరునవ్వు నవ్వి, అరచెయ్యెత్తి ఊపుతూ 'అంతా కుశలమే'నన్నట్టు సంజ్ఞ చేశాడు. ఇంక పరాంకుశంగారు భార్యతో మాట్లాడసాగాడు. మాటలంటే సంజ్ఞలే. నేను వచ్చిన పనిచెప్పాడు. ఆమె నావంక తిరిగి చిరునవ్వు చిందించింది. ''వుండు నాయనా! నీకిక్కడ ఏ ఇబ్బందీ వుండదు, ఒక్క మావారి మాటల ఇబ్బంది తప్ప. ఆయనతో మాత్రం జాగ్రత్త'' అని లోపలికి వెళ్ళిపోయింది.

''ఆవిడలాగే అంటుంది లేవయ్యా. నువ్వేం భయపడకు. ఈ ఆడవాళ్ళున్నారే ముసలితనం ఎక్కువైన కొద్దీ చనువెక్కువై మొగుణ్ణి ఎద్దేవా చేస్తుంటారు. మనవాళ్ల క్షేమ సమాచారాలు తెల్సుకోటం పాపమా? ఇంటికి వచ్చిన వ్యక్తితో ముభావంగా వుంటే, ఆ మనిషేమనుకుంటాడు. నువ్వు చెప్పు బ్రహ్మానందం! నువ్వెంత హాయిగా వున్నావు ఇక్కడ. నేనింత కలుపుగోలు మనిషిని కాబట్టే మా ఇంట్లో అద్దెకుండి వెళ్ళిపోయిన వాళ్లందరూ, తరువాత ఎక్కడైనా కన్పిస్తే ఎంత ఆత్మీయంగా పలకరిస్తారనీ. అంటీ ముట్టని వాళ్లంటే పలకరిస్తారటయ్యా! పక్కవాడిని నోరారా పలకరించని వాడికి నోరెందుకంట? తింటానికా? తింటానికి జంతువులకూ వున్నాయి నోళ్ళు. మనం మానవులం, బుద్ధి జీవులం. మన భావాలు వ్యక్తం చేయటానికే నోటినుపయోగిస్తాం. నోటి ద్వారా మనం నిర్వహించే ఆపనే ఉత్తమకర్మ. తిండి తింటానికే ఉపయోగిస్తే అది నోరుకాదు, పాటిదిబ్బ...''

ఇహ బ్రహ్మానందం ఆ బాధ భరించలేక 'గది చూపిద్దా'మని ఆయన్ని లేపటంతో ఆయనికిక తప్పలేదు. ఆయనన్నట్టు గది చక్కగా వుంది. అన్ని ఏర్పాట్లూ వున్నాయి. మాకు గది చూపిస్తూ, ఆయన ఆ ఇల్లు కట్టటానికి ఎంత శ్రమపడ్డాడో వివరించి చెప్పాడు పరాంకుశంగారు.

బయటకొస్తుంటే వుండబట్టలేక నేనన్నాను. ''చక్కటి తోట పెంచారండి మీరు'' అని.

అంతే ఇహ ఆయన దృష్టి తోట వైపు సాగింది. నోరు మాట్లాడసాగింది. ''ఏదీ ఈ పట్నంలో జాగా దొరకటమే కష్టం. దొరికినంత మేరా ఇళ్ళే కట్టేస్తున్నారు జనం. మరి పట్నాలు కాంక్రీట్

జంగిల్స్‌కాక మరేమవుతాయి. మనిషిలో లోభత్వం పోవాలయ్యా. ప్రతి మనిషీ మొక్కలు పెంచాలి. తమకున్న కొద్ది జాగాలోనే చిన్న గార్డెన్ పెంచాలి. అప్పుడు వర్షాలు కురవకేం చేస్తాయి. పొల్యూషననే మాటయిన వుంటుందా? చూస్తున్నా కదా! ఎవడికీ సామాజిక బాధ్యత లేదయ్యా ఇంటి మీద ఇల్లు కట్టాలన్న ఆలోచన తప్ప సంఘంలో తనవంతు బాధ్యత నిర్వహించాలన్న జ్ఞానం లేదు. అయితే మొక్కలు పెంచటం మామూలు వ్యవహారం అనుకునేవు... పిల్లల్ని పెంచినట్లు పెంచాలి వాటిని. రోజూ నీళ్లు పెట్టాలి. పాదులు చెయ్యాలి...''

అలా చెప్పుతూనే వున్నాడు ఆయన. పొద్దున 8 గంటలకు వచ్చిన వాళ్ళం ఆయన్నొదిలించుకుని బయటపడేటప్పటికి 12 గంటలయింది. అప్పటికీ ఆయన భార్య ఆయన్ని భోజనానికి లెమ్మని పోరు పెట్టటంతో తప్పక మమ్మల్ని వదిలేశాడు ఆయన.

ఇంట్లో నుండి బయటపడ్డ తరువాత బ్రహ్మానందం డాక్టరు రోగికి పాటించాల్సిన జాగ్రత్తలు చెప్పినట్టు, నాకూ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను గూర్చి చిన్న లెక్చరిచ్చాడు. ''సరే గదిలో దిగుతున్నావు, బానేవుంది. నువ్వు సజీవంగా సర్వావయవాలతో నిక్షేపంగా వుండాలంటే నేను చెప్పే మాటలు గుర్తుంచుకోవాల్సి ఉంటుంది. ఒకటి - బోర్‌లకు, వక్తవ్య విషయాలకు కొదువ వుండదు. ఒక సబ్జెక్టు నుండి మరో సబ్జెక్టుకు అలా పాకుకుంటూ పోతూనే వుంటారు. కనుక నువ్వు మొదటగా నేర్చుకోవాల్సింది వాళ్ళకు నీ అంతట నువ్వు సబ్జెక్టులు అందించరాదు. అది ఆత్మహత్యాసదృశం. నువ్వింతకు ముందు చేసింది అదనే. రెండు - ఎప్పుడూ బిజీగా కన్పించు. తీరిగ్గా వున్నట్టు కన్పిస్తే పరాంకుశంగారు నిన్ను వదలడు. వీలయితే వేకువఝామునే గది నుండి బయటపడి, రాత్రి పదిగంటలకు మాత్రమే తిరిగిరా. మూడు సాధారణంగా మానవులు ఇతరుల మనస్సులు నొప్పించటానికి ఇష్టపడరు. బోర్‌లు అదే అలుసుగా తీసుకుంటారు. చెప్పగలిగితే చెప్పెయ్యి 'నువ్వు బోర్ కొట్టిస్తున్నావ'ని. అప్పుడు ఆయన నీ జోలికి రాడు...'' ఇలా ఓ పది సూత్రాలు టెన్ కమాండ్‌మెంట్స్ - చెప్పి బోరు కొట్టించాడు బ్రహ్మానందం.

ఆ మర్నాడే నెల అడ్వాన్సు ఇచ్చి, ఆ గదిలో దిగాను. వీలైనంతగా బ్రహ్మానందం సూచనలు పాటించసాగాను, ఒక్క థర్డ్ కమాండ్‌మెంట్ తప్ప, అయితే పరాంకుశంగారు ఆరితేరిన మేటి వీరుడు. ఆయన నా తంత్రాలన్నీ వమ్ముచేసి, నన్ను నిరస్త్రుణ్ని చేసి, తన మాటల శిత శిలీముఖాలతో నన్ను బాధించసాగాడు. ఆయన బారినుండి తప్పించుకోటానికి రిసెర్చి ప్రారంభించాను. కొత్త మార్గాలు అవలంబించసాగాను. ఆయన ధోరణి మాన్పటానికి ఆయనకు చదరంగం సెట్ కొనిచ్చాను. భార్యతో ఆడుకుంటాడు కదా, కాస్తంత కాలక్షేపం అవుతుందని. అయితే చెవిటి మాలోకం భార్యతో ఆడటం ఆయనికిష్టంలేదు. ఆ భస్మాసుర హస్తం ఆయన నాపైనే వుంచాడు. నేనే ఆయనతో ఆడాలి. అలా అని ఆలోచించి త్వరత్వరగా ఎత్తులు వేయడు.

చదరంగం మీద పుస్తకాలు చదివి, కొత్త రకాల ఓపెనింగులు, ఎత్తులు వగైరాల మీద లెక్చర్లిచ్చేవాడు. నాలుగ్గంటలయినా ఒక్క ఆటకూడా అయ్యేది కాదు.

అలా కాదని ఓ కొత్త ప్రయోగం చేశాను. ఆయనను ఎంగేజ్ చేయటానికి గళ్ల నుడికట్లు ప్రచురించే దినవార మాస పత్రికలు కొని ఆయనకిచ్చే వాడిని. గళ్లనుడికట్లు నింపటం చక్కటి వ్యాసంగమని ఆయనకు ప్రబోధించాను. ఆయనకీ వాటిపై ఆసక్తి కలిగింది కాని, అర్ధరాత్రి అపరాత్రి అని లేకుండా నన్ను డిస్టర్బ్ చేయసాగాడాయన. రాత్రి పన్నెండు గంటలకు దబదబా తలుపుకొట్టి. ''దొరికిందోయ్ క్లూ. సాయంత్రం నుండి ఆలోచిస్తూనే వున్నాను. తట్టి చావందే. ఇప్పటికి గాని స్ఫురించలేదు. నీకూ చెప్తే ప్రశాంతంగా నిద్రపోతావని నిన్ను నిద్రలేపాను'' అనేవాడు. ఏమనగలం, అమాయకంగా మొహంపెట్టి, మనక్షేమమే తన క్షేమమని మాట్లాడే వ్యక్తితో.

ఓ రోజు పొద్దున్నే ఆయన మాటలు బయట వినపడితే ఎవరా ఆ వచ్చింది అని కిటికీలో గుండా తొంగి చూశాను. ఎవరూ లేరు. ఆయన మొక్కలకు పాదులు చేస్తున్నాడు. మల్లెతీగకు గల్ఫ్ రాజకీయాలు బోధిస్తున్నాడు. ''ఈ సద్దాంహుసేనుకేం మాయరోగమంట? అమెరికా లాంటి అత్యాధునిక ఆయుధసామగ్రి కలిగిన దేశంతో యుద్ధం చేసి గెలుద్దామనే. పైగా 'మదర్ ఆఫ్ బాటిల్స్' అట నా ముఖం. అలా అని ఈ కాపిటలిస్ట్, ఇంపీరియలిస్ట్ దేశాలు పవిత్రోద్దేశంతో దురాక్రమణకు వ్యతిరేకంగా యుద్ధానికి దిగాయని నేననను. మిగతా మరోచోట ఎక్కడైనా ఇలా దురాక్రమణ జరిగితే, ఈ దేశాలు యుద్ధం చేయటానికి సన్నద్ధమవుతాయా నువ్వు చెప్పు? కువైట్‌లోని ఆయిల్ నిక్షేపాల మీద దృష్టిలేకపోతే అమెరికా ఇంత వ్యయ ప్రయాసలకోర్చి యుద్ధం చేస్తుందా?'' అని.

అలా ఆయన నోటి దురదతో బదులు పల్కలేని మల్లెమొక్కకు విన్పిస్తుంటే నాకు నిజంగా జాలి కలిగింది. మరో ఆలోచన తట్టింది. మరీ నిర్జీవ పదార్థాలు కాకుండా, బుద్ధిలేకపోయినా సజీవమైనదొకటి ఆయనకందుబాటులో వుంటే బావుండుననిపించి, బజారులో వాకబు చేసి ఓ చక్కటి జాతి కుక్కపిల్లను కొని ఆయనకు ప్రెజంట్ చేశాను. దాంతో ఆయనకు బ్రహ్మాండమైన కాలక్షేపమయిపోతోంది. మార్నింగ్ వాక్‌కి దాన్ని తనతో తీసుకవెళ్లేవాడు. పేపరు చదివి విన్పించేవాడు. అది నోరెళ్లబెట్టి చొంగకార్చుకుంటూ ఆయన మాటలు వినేది. కొంతమేరకు నన్ను నేను ఆయననుండి కాపాడుకున్నా కదా అని మురిసిపోసాగాను. కాని ఆపైవాడు చూసి ఓర్చుకోలేకపోయాడు. నా చివరి ప్రయత్నమూ వమ్మయిపోయింది. కుక్కకు సహజగుణం మొరగటం, ముఖ్యంగా కొత్తవాళ్లువస్తే మొరిగి, కరిచెయ్యటం. కానీ అది ఆయన మాటలు వినీ వినీ మొరగటం మర్చిపోయింది. జాలిగా, నిర్జీవంగా నిస్తేజంగా శూన్యంలోకి చూపులు

నిగుడించేది. పక్షవాతం వచ్చినట్టు నోరు తెరవటం మానేసింది. జీవితానికర్థమేమిటి? అన్న తాత్వికచింతనలో పడిపోయింది. జీవితం నిరర్థకం అన్న నిశ్చయానికొచ్చినట్టుంది. ఓరోజు గుట్టు చప్పుడు కాకుండా తనువు చాలించింది. అదిపోయినప్పుడు పరాంకుశంగార్ని పట్టశక్యం కాకపోయిందినాకు. ఆత్మబంధువు పోయినట్టు విలపించాడాయన. శ్రద్ధగా దానికంత్యక్రియలు జరిపించాడు.

కుక్క చనిపోయిన తరువాత, ఆబాధ కొంత నెమ్మళించిన తరువాత పరాంకుశంగారు దాని గుణగానం చేయసాగాడు. ఏ మనిషి కనిపించినా తన 'బుజ్జిముండ' 'కన్నిముండ' సారమేయరాజాన్ని గురించి చెప్పేవాడు. నా పరిస్థితి మొదటికే వచ్చింది. ఎంత ఆయన బారిన పడకుండా తప్పుకోవాలన్నా వీలవటం లేదు. చిట్టచివరి ప్రయత్నంగా ఎవరో చెప్తే ఓకొత్తరకం యోగసాధనం చేయసాగాను. అది - ఎదటి మనిషి ఏం చెప్తున్నా వినకుండా మన పని మనం చేసుకోవటం. మాటల్ని వింటున్నట్టు నటిస్తూ, పేపరు చదవటమో నవల పఠించటమో చేయసాగాను. కొంతవరకు ఆ ప్రయత్నంలో సఫలీకృతుడనయ్యాను. అయితే ఈయోగ సాధనవల్ల ఆఫీసులో పెద్ద ఇబ్బంది ఏర్పడింది. ఆఫీసరు పిల్చి దొబ్బులేసినా వినటం మానేశాను. అంతవరకూ మంచిదే. సహోద్యోగులు పిలుస్తున్నా విన్పించుకోటం మానేశాను. ఓసారి బ్రహ్మానందం నన్ను పిల్చి హెచ్చరిక చేశాడు కూడా, ''చూడవోయ్! వెంకట్రావ్! నువ్వూ పద్మావతమ్మగారిలా చెవుడుతెచ్చుకునేటట్టున్నావు. అసలే పెళ్ళికాని పిల్లవాడివి జాగ్రత్త!'' అని.

''లేదండీ. కొత్త యోగ సాధన చేస్తున్నాను. ఇతరులేం మాట్లాడుతున్నా వినకుండా మైండ్‌ని ఆఫ్ చేసే కొత్త ప్రయోగం మొదలెట్టాను'' అని అతనికి విపులీకరించాను.

''లాభం లేదోయ్! సైకియాట్రిస్ట్ దగ్గరికెళ్దాంపద. నిక్షేపంలాంటి కుర్రాడివిలా అయిపోవటం నాకేం బాగలేదు'' అన్నాడతను ఇంక నేనేం చెప్పినా వినకుండా.

నేనింతగా యోగసాధనలో విజయం సాధించటం చూడలేక బ్రహ్మానందం కుళ్లుకుంటున్నాడు అన్పించింది నాకు. ఈర్ష్యాసూయలు అలాంటివి. ఏ మనిషైనా పైకి పోతుంటే చూడలేకపోవటం సర్వసాధారణం. అతన్ని తప్పించుక తిరగసాగాను.

అయితే ఆ దేవుడికే కళ్ళు కుట్టినట్టయ్యి నా యోగ సాధనకంతరాయం కలిగింది. పరాంకుశంగారిరెండో కొడుకు కుశాగ్రావును ప్రమోషన్‌మీద హైదరాబాదు బదిలీ చేశారు. అతను ఇంజనీరు. అతని ఇంజనీరింగ్ ప్రతిభకంటే, అతనిలో మనుష్యుల్ని వేపుకుతినే తత్త్వాన్ని గొప్పగా పరిగణించి ఆంధ్రప్రదేశ్‌కు ఏరియా సేల్స్ మానేజర్‌గా ప్రమోషన్‌మీద అతన్ని హైదరాబాదు పంపించారు. ఎన్నో సంవత్సరాల తర్వాత కొడుకు తమ దగ్గరకు వస్తున్నాడని పరాంకుశంగారు, పద్మావతమ్మగారు ఎంతో సంతోషించారు. అయితే పరాంకుశంగారికి ఆ

సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు. ఈ గడచిన తొమ్మిదేళ్లలో కొడుకు వాగ్ధాటిలో ఎంత నైపుణ్యం సంపాదించాడో ఆయన అంచనా వేయలేకపోయాడు. వచ్చిన రోజే కుశాగ్రావు తండ్రిని ఉతికి ఎండేశాడు. తను 'షార్ట్ సర్వీస్ కమిషన్'లో వున్న ఆ ఏడేళ్ళ వివరాలు, ఆ తరువాత తనకుద్యోగమిచ్చిన తన కంపెనీలోని అనుభవాలు చెప్పి చెప్పి ఆయన్ని బోరు కొట్టించాడు. ఇంతకాలం ఆయన చెప్తే ఎదుటి వాళ్లు వినటమే తప్ప ఆయన నోరు మూసింది లేదు. శ్రోతలకున్న బాధ మొదటిసారిగా ఆయనకనుభవమయింది.

పరాంకుశంగారు మాట్లాడితే కాస్తంత రీజనబుల్‌గా, సెన్సిబుల్‌గా వుండేది. ఇతని తరహావేరు. ఎదుటి వాళ్లనసలు నోరు ఎత్తనివ్వడు. మర్నాడు పొద్దున పరాంకుశంగారు పేపరు చదివే సదుద్దేశంతో పేపరు పుచ్చుకుని పడక్కుర్చీలో కూర్చున్నాడో లేదో, కుమారరత్నం తల్లిచ్చిన కాఫీ కప్పు పట్టుకుని తండ్రి మీద దాడి చేశాడు. నేను నాగది కిటికీలోనుండి ఇదంతా చూస్తూనే వున్నా.

''పేపరేం చూస్తావు నాన్నా! వాటిల్లో ఎప్పుడూ ఒకటే విషయం. ఇవ్వాల్టి పేపరు చదివితే పదేళ్ల తరువాత పరిస్థితులెలా వుంటాయో చెప్పొచ్చు. అందుకనే నేను పేపరు చదవను. మనుషుల మనసులు చదవటం ముఖ్యం. నేను పేపరు ఎప్పుడు కొంటానో తెల్సా- బెడ్డింగ్‌లాంటివేమీలేకుండా ట్రైన్‌లో ప్రయాణం చెయ్యాల్సి వస్తే బెర్త్ మీద పరుచుకుని పడుకోటానికి వీలుగా వుంటుందని పేపరు కొంటాను. అఫ్‌కోర్సు, చిన్న చిన్న వస్తువులు కూడా పేక్ చెయ్యటానికి పనికి వస్తాయనుకో అవి. ముఖ్యంగా చెప్పులు వాటిలో చుట్టి ప్రయాణాలప్పుడు పెట్టెలో పెట్టుకోటానికి పనికివస్తాయి. ఇదివరకు పేపరు కోన్స్‌లో సరుకులు చుట్టి ఇచ్చేవాళ్లు. కొంతకాలానికి పేపరు సంచులు వచ్చాయి. ఇప్పుడు పాలిథీన్ బాగ్‌ల వాడకం విరివికావటంతో పేపరు వాడకం పడిపోయింది. అఫ్‌కోర్సు పల్లీలు, బఠానీలు అమ్మే స్ట్రీట్ హాకర్స్ అనాగరికంగా ఇప్పటికీ పేపరు వాడ్తున్నారు. అయితే ఈ అనాగరికపు మనుషుల ప్రయోజనార్ధం పేపర్ ఇండస్ట్రీని రన్‌చేయటం ఎంతవరకు మంచిదంటావు. నా ఉద్దేశంలో న్యూస్ పేపర్లనన్నిటినీ మూసేస్తే దేశంలో సగం వృథా ఖర్చునాపు చేయగలం...''

''అదికాదురా అబ్బీ...'' అని పరాంకుశంగారేదో చెప్పబోయాడు.

''అబ్బ! విను నాన్నా! మధ్యలో అడ్డురాకు. అంత అసహనం అయితే ఎలా? మా మిలటరీలో ఇలా మాటలకడ్డం వస్తే 'కోర్ట్ మార్షల్' చేస్తారు. సరే చెప్పే విషయం న్యూస్ పేపర్ల గురించి కదా! అమెరికాలో రోజూ 50,60 పేజీల న్యూస్ పేపర్లు ప్రింట్ చేస్తున్నారు. ఎంత నేషనల్ వేస్ట్. అదంతా చదవటం ఒక రోజులో అయ్యే పనా! పేపరు చదువుతూ కూర్చున్నామంటే మిగతా ఇంపార్టెంట్ పనులన్నీ పెండింగ్‌లో పడిపోతాయి. న్యూస్ పేపర్ చదవటమనేది ఒక వ్యసనం.

అమెరికాలో చాలామంది మానసిక రోగాలతో బాధపడటానికి కారణం న్యూస్ పేపర్లే అని ఈమధ్యే జరిగిన రిసెర్చి వలన తేలింది. పేపరు తెరిస్తే హత్యలు, మానభంగాలు, టెర్రరిస్ట్ ఆక్టివిటీస్. రోజూ ఇలాంటివి చదువుతున్న మనిషి హృదయం కరుడు కట్టుకుపోతున్నది. యాంత్రికంగా పేపరు చూస్తాడు. అయ్యో! ఇంతమంది చనిపోయారే... అన్న సానుభూతి, కనీస స్పందన లేకుండా. మన మహాపురుషులు, ఆ మాటకొస్తే ఏ దేశంలోనయినా మహా మహాతత్త్వవేత్తలు ఏ పేపర్లు చూసి ప్రపంచాన్ని గూర్చి తెల్సుకున్నారు, మనకు తెలియచెప్పారు. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే...''

ఇలా అప్రతిహతంగా 'న్యూస్‌పేపర్లు', వాటివల్ల కలిగే అనర్థాలు అన్న మహత్తర విషయం మీద ఏకధాటిగా మాట్లాడుతుంటే, భరించలేని పరాంకుశంగారు - మనలోమాట. కొంతమందికి కొడుకులు కూడా తమని మించిపోవటం ఇష్టం వుండదు - ''స్నానం చేసి వస్తారా, తర్వాత మాట్లాడుకుందాం'' అని టవల్ తీసుకుని బాత్రూంలోకి దూరాడు, కొడుకు పిలుస్తున్నా వినకుండా.

నేను నా గది కిటికీ చప్పున మూసేశాను. కుశాల్రావు నన్ను చూస్తే వదిలిపెట్టడు. వెంటనే ఆదరాబాదరా గుడ్డలేసుకుని టైంకాకపోయినా ముందే ఆఫీసుకు బయల్దేరాను.

వారం రోజులుగా పరాంకుశంగారు నాతో మాట్లాడటంలేదు. నన్ను చూసినా పట్టనట్టు వుండిపోతున్నాడు. ఈ వారం రోజుల్లో కుశాల్రావు ఆఫీసులో జాయినవటం, సాయంత్రం ఆరూ ఆరున్నరదాకా ఆఫీసులోనే వుండటంతో పరాంకుశం గారికి కాస్త గాలి పీల్చుకున్నట్టయింది. ఆదివారం వచ్చిందీ అంటే మర్నాటికల్లా ఏనుగులా వుండే మనిషి పీనుగులా తయారవుతున్నాడు.

ఆరోజు సాయంత్రం పరాంకుశంగారు, కొడుకు ఆఫీసు నుంచి తిరిగి వచ్చాడేమోననుకుంటూ, బిక్కుబిక్కుమనుకుంటూ ఇంట్లోకొచ్చాడు. ఇంటికి పేపరు రావటం బంద్వైంది. ఆయనే సాయంత్రాలు లైబ్రరీకి వెళ్ళి, కొడుక్కు తెలీకుండా, పేపరు చూసొస్తున్నాడు.

ఆయన రావటం చూసి పద్మావతమ్మగారు మంచినీళ్లు తెచ్చిచ్చింది. ''వీడింకా ఆఫీసు నుండి రాలేదా!'' అని కొడుకుని గురించి సైగచేస్తూ భార్యనడిగాడు.

''టూర్ వెళ్లాడు. వారానికి నాల్గైదు రోజులైనా తిరుగుతూనే వుండాలట. పాడుద్యోగం. పిల్లాడు ఇంటిపట్టునుండకుండా వచ్చింది ఉద్యోగం'' అంది ఆమె.

''వీడిట్లా తయారయ్యాడేమే'' అన్నాడాయన సంజ్ఞ చేస్తూ.

ఆమె పగలబడి నవ్వింది. ''మీ కొడుక్కాదూ'' అంది.

''ఛ ఛ నేనంత ఇదిగా మాట్లాడతానా. వీడు మనుష్యులనే సజీవ దహనం చేస్తున్నాడు. ఇంట్లో వున్నాడంటే నాపుర మార్చుతున్నాడు'' అన్నాడాయన సంజ్ఞలు చేస్తూ విచారంగా ముఖం పెట్టి.

''భయపడకండి. వాడిలో మాత్రం మార్పురాదూ!'' అందామె అనునయంగా.

''వస్తుందంటావా, ఏమో, నాకా ఆశలేదు.''

''పెళ్ళి చేద్దాం, మార్పు వస్తుంది. లేదా వేరే కాపురం పెట్టించేద్దాం''

ఆమె అలా ఆసరా ఇవ్వటంతో ఆయన ముఖంలో కాస్తంత వెలుగు కనబడింది.

కుశాగ్రావు నా వెంట పడటంలేదు. నాతో మాట్లాడేంత తీరిక దొరకటంలేదతనికి. పరాంకుశంగారు మహా మితభాషి అయిపోయాడు. నాకు గది మార్చాల్సిన అవసరం కలగలేదు. ఇప్పుడు నా ఆరోగ్యం బాగానే వుంటున్నది. పరాధ్యాన్నం మటుమాయమయింది. రెండు కిలోలు బరువు కూడా పెరిగాను.

కొడుక్కు సంబంధాలు చూస్తున్నాడు పరాంకుశంగారు. కుశాగ్రావు వాక్పటిమ వల్ల ఇప్పటికి పది సంబంధాలు తప్పిపోయాయి. అతను పెళ్ళిచూపులకెళ్ళినప్పుడల్లా అతను పిల్లతో మాట్లాడతాననటం, అతనితో మాట్లాడిన పిల్లెవరూ అతన్ని చేసుకోటానికి ఇష్టపడకపోవటం ఇలా జరుగుతున్నది. అయినా పరాంకుశంగారు ఊర్కోలేదు. కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నాడు.

మీకు పుణ్యం వస్తుంది. మీ ఎరికలో ఏమన్నా సంబంధాలుంటే చెప్పండి. వంద అబద్ధాలయినా ఆడి ఓ పెళ్ళి చేయమన్నారు. ఇక్కడ రెండిందాల పుణ్యం మీకు, కుశాగ్రావు బ్రహ్మచర్య చెర వదిలించి నందుకూ, పరాంకుశంగారిని కొడుకు బారినుండి కాపాడినందుకూ.

'ఈనాడు' ఆదివారం

28-7-1991